www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 209, ఆదివారం 30-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**ఫీజు బకాయి బిజెపి లడాయి**



4లో..

**ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**



3వ పేజీల్లో



## ఉద్యమకారుల రుణం తీర్చు కోవాలి

వెబ్ సైట్ డిజైన్ చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలి

సిఎం రేవంత్‌కు కేకే కమిటీ నివేదిక

2

పర్యాటకం, క్రీడల ప్రచారానికి...

## కపిల్‌దేవ్ సేవలు




జవహర్ నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు

మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

2

ఎంఐఎం ఎమ్మెల్సీ

## రహ్మత్ సస్పెన్షన్

మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశం



2

# సర్ ప్రక్రియ... పరిశీలన గడువు పెంచండి

## సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేవని వివరణ

92.86 లక్షల ఓట్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన జరగాలి

పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి

సర్ ప్రక్రియ పూర్తి కి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది

అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున,మరో 4 వారాలు పెంచాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి సిఎం రేవంత్ రెడ్డి లేఖ



**హైదరాబాద్ ఆగస్ట్ 29:**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు,క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలని కోరారు. 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, ఇళ్లు మారితే నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ..మిగతా 2లో



## చెరువుల పునరుద్దరణ అత్యావశ్యకం

నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి

సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక

2



బయట హిందువులు...

## ఇంట్లో మత ప్రార్థనలు

### మతం మారితేనే వైసీపీలో మనుగడ

వైసీపీ హయాంలో బలవంతపు మత మార్పిడులు.. చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**అరకు ఆగస్టు 29 :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లో ఉండాలంటే మతం మారాల్సిందేనని, ఆ పార్టీ నేతలు బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని సీఎం చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. అరకు పర్యటనలో భాగంగా నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో హిందూ దేవాలయాల పవిత్రతను దెబ్బ తీశారని, ఆలయాలపై దాడులు చేశారని మండిపడ్డారు. ఓ మాజీ మంత్రి కోడలిని మతం మారాలని ఒత్తిడి చేశారని అన్నారు. ఆమె ఇటీవల బహిరంగంగానే ఈ విషయాన్ని వెల్లడించారని తెలిపారు. ఆమెను ఇంట్లో పూజలు కూడా చేసుకోనివ్వలేదని తెలిపారు. వైసీపీ నేతలంతా క్రైస్తవాన్ని అనుసరిస్తూ బయట హిందువులుగా చెలామణి అవుతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. అయితే వ్యక్తిగతంగా ఎవరైనా, ఏ మతమైనా అనుసరించవచ్చని, కానీ, ఇతర మతాలను బలవంతంగా ఒకరిపై రుద్దడం మంచిది కాదన్నారు. వైసీపీలో ఉండాలంటే మతం ఒక ప్రాతిపదికగా మార్చేశారని చంద్రబాబు విమర్శించారు. ఈ కారణంగానే కొందరు నాయకులు సైతం మతం మారారని, ఇలా బలవవంతంగా మతం మార్చడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తాష్కెంట్ చేరుకున్న ప్రధాని



2

సూర్యుడు చుట్టూ భూమి తిరిగితే...

## భూమి చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు

రేవంత్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది

22ఎ బాధితులతో మాజీ మంత్రి హరీష్ రావు



**సంగారెడ్డి ఆగస్టు 29 :**

రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. పేదలకు ఓ న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. సంగారెడ్డిలో ఈరోజు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిషేధిత జాబితాలో భూములు పెట్టిన తర్వాత సీఎం, మంత్రి పొంగులేటి ఏజెంట్లు కమిషన్ కోసం తిరుగుతున్నారన్నారు. రక్షకుడిగా ఉండాల్సిన ప్రభుత్వం భక్షకుడిగా మారిందని ఆరోపించారు. చేసిన తప్పుకు సీఎం రేవంత్ చెంపలేసుకుని క్షమాపణ చెప్పాలి. సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్టు భూముల చుట్టూ సీఎం రేవంత్ తిరుగుతున్నారన్నారు. పేదల ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్, ఆయన తమ్ముళ్లు కడుపు నింపుకుంటున్నారని కళ్యాణలక్ష్మి చెక్కులు పెళ్లయి పిల్లలు పుట్టిన తర్వాత వస్తున్నాయి. 58, 59 జీవోల పేరుతో కొందరు అధికారులు పేద ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేడు నీట్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్

పటిష్ట ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీసులు




2



జైలుకు వెళ్లకుండా తప్పించుకున్నోళ్లే...

## వైసీపీలో నమ్మక ద్రోహులు

నేనే నమ్మకద్రోహినే అయితే జైలులో ఎందుకు ఉంటా

వైసిపి వైసీపీ దుష్ప్రచారాలపై విజయసాయి మండిపాటు

**అమరావతి ఆగస్ట్ 29 :**

తాను ఏనాడూ నమ్మకద్రోహం పనులు చేయలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తనపై నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈమేరకు ఎక్స వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. 'నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి ..మిగతా 2లో

# భవిష్యత్ పోరాటాలపై బిజెపి సమీక్ష

22ఎ భూములపై త్వరలోనే కార్యాచరణ

పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష

**హైదరాబాద్ ఆగస్ట్29**

తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికపుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో ..మిగతా 2లో




## 'శుద్ధీకరణ' ఘటనపై కేసు నమోదు చేయాలి




బిజెపి, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం

బిజెపి తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ ఆగస్ట్ 29 :**

ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోకసేభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తపబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని ..మిగతా 2లో

# పర్యాటకం, క్రీడల ప్రచారానికి... కపిల్‌దేవ్ సేవలు

**జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు**

**మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**

**హైదరాబాద్ ఆగస్ట్29:**




పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

## విశాఖలోఒకే కుటుంబానికి చెందిన...

# నలుగురు ఆత్మహత్య

**విశాఖపట్నం ఆగస్ట్29:**

జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన పెందుర్తి మండలం చింతలగ్రహారం కాలనీలో తీవ్ర కలకలం రేపింది. మల్లా వినోద్‌కుమార్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వినోద్‌కుమార్ ముందుగా తన భార్య, ఇద్దరు కుమార్తెలకు విషం ఇచ్చి అనంతరం తానూ ఆత్మహత్యకు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

## మంత్రివర్గంలో

# కొత్తదనం నింపాలి

**పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయాలి**

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**హైదరాబాద్ ఆగస్ట్ 29:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని కానీ, కాంగ్రెస్ పాలనపై సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు.మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన కీలక విషయాలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెపకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22 ఎ ని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్దిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## సర్ ప్రక్రియ... పరిశీలన

# గడువు పెంచండి

**మొదటి పేజీ తరువాయి...**

అదనపు ఈఆర్‌వోలను నియమించాలని కోరారు. ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు, తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. తనిఖీ పక్రియను వికేంద్రీకరించాలని సీఈసీపక్రియను లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## చెరువుల పునరుద్ధరణ అత్యావశ్యకం

**నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి**

**సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక**

**హైదరాబాద్ ఆగస్ట్ 29:**

తెలంగాణలో చెరువుల పరిరక్షణ, చిన్న నీటిపారుదల వ్యవస్థ బలోపేతం దిశగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలక సూచనలు చేసింది. చిన్న నీటిపారుదల వ్యవస్థను ప్రత్యేకంగా పునరుద్ధరించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను సమన్వయం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థను తీసుకురావాలని సిఫారసు చేసింది. చిన్న నీటిపారుదలపై రూపొందించిన నివేదికను కమిషన్ ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ రంగ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని సూచించింది. చెరువుల పూర్తి నీటి నిల్వ మట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి శాశ్వతంగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చిన్న చెరువులు, ఇతర చిన్న నీటి వనరులను పెద్ద నీటిపారుదల వ్యవస్థలతో అనుసంధానించే విధానాన్ని రూపొందించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిపై మరింత దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటల సాగును పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపైనా కమిషన్ ప్రత్యేకంగా పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అంశాలపై కూడా కమిషన్ మరింత దృష్టి సారించాలని సీఎంకు సూచించారు.

## భవిష్యత్ పోరాటాలపై బిజెపి సమీక్ష

**మొదటి పేజీ తరువాయి...**

టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

## 'శుద్ధీకరణ' ఘటనపై

# కేసు నమోదు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**




రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించినమీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు. ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.



## ఉద్యమకారుల రుణం తీర్చుకోవాలి

**వెబ్ సైట్ డిజైన్ చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలి**

**సిఎం రేవంత్‌కు కేకే కమిటీ నివేదిక**

**హైదరాబాద్ ఆగస్ట్ 29:**

తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.



## ఎంఐఎం ఎమ్మెల్సీ

# రహ్మత్ సస్పెన్షన్

**మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు**

**ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశం**

**హైదరాబాద్ ఆగస్ట్ 29:**

ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన పార్టీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసినట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్ఏ హుస్సేన్ అన్వర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మిర్జా రహ్మత్ బేగ్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా పత్రాన్ని వెంటనే శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం అత్తాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని రహ్మత్ బేగ్‌పై ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలే పార్టీ నిర్ణయానికి కారణమని ఎంఐఎం అధికారికంగా వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయనపై పార్టీ తీసుకున్న చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# నేడు నీట్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్

**పటిష్ట ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీసులు**

**వరంగల్ ఆగస్ట్ 29:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ పీజీ-2026 పరీక్షల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరరాదని ఆమె సూచించారు. ఈ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మైకులు, డీజేలతో ఊరేగింపులకూ అనుమతి ఉండదన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘాను మరింత పెంచామని, అవసరమైన సమాచారం సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎంఎల్ చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల సజావు నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కమిషనర్ ఎన్. శ్వేత విజ్ఞప్తి చేశారు.



## తాష్కెంట్ చేరుకున్న ప్రధాని

**న్యూఢిల్లీ ఆగస్టు 29 :**

తాష్కెంట్‌లో 'నూతన ఉజ్బెకిస్థాన్' స్మారక చిహ్నంవద్ద శనివారం సాయంత్రం పుష్పగుచ్ఛం సమర్పించిన ప్రధాని నరేంద్ర మోడీ.తాష్కెంట్ చేరుకున్న అనంతరం ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో కలిసి 'నూతన ఉజ్బెకిస్థాన్' స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించిన ప్రధాని నరేంద్ర మోడీ.ఉజ్బెక్ ప్రజల ఆకాంక్షలు, దేశ ప్రగతికి ప్రతీకగా 'నూతన ఉజ్బెకిస్థాన్' స్మారక చిహ్నం నిలుస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఉజ్బెకిస్థాన్ పర్యటనను ఈ స్మారక చిహ్నాన్ని సందర్శించడం ద్వారా ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

## జైలుకు వెళ్లకుండా తప్పించుకున్నోళ్లే...

# వైసీపీలో నమ్మక ద్రోహులు

**మొదటి పేజీ తరువాయి...**

చేసుకునేవాడిని. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. నమ్మకస్తుణ్ని అనే కారణంతో ప్రతి ఛార్జిషీట్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నా పేరు చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు కారాగారంలో ఉంచారు. నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లోనూ ఏ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా చేర్చారు. సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. ఏ కేసులూ లేకుండా ఎలానో కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి కోటరీ నాయకుడు కుట్ర పన్నారు. నాపై అసత్యాలు చెప్పి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారు. జగన్ మెప కోసమే నాస్తికుడిగా చెపకొన్న ఆయన వైకాపాకే కాదు రాష్ట్రానికే నమ్మకద్రోహి నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించిందెవరు 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతిమించింది జగన్‌ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది సజ్జల కాదా అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

# ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**- టేబుల్ టెన్నిస్ కోచ్ సాంబమూర్తికి ఘన సన్మానం**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 30( భద్రాద్రిన్యూస్):** ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రీడారంగానికి విశేష సేవలందిస్తున్న వివిధ క్రీడా విభాగాల కోచ్‌లను ఘనంగా సత్కరించారు. జిల్లాలో టేబుల్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి విశేష కృషి చేస్తూ, ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తీర్చిదిద్దుతున్న ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, ప్రముఖ కోచ్ వి.ఎస్.ఎస్. సాంబమూర్తిని ఉత్తమ కోచ్‌గా అభినందిస్తూ జిల్లా యువజన మరియు క్రీడల అధికారి టి. సునీల్ కుమార్ రెడ్డి ఘనంగా సత్కరించారు. శాలువా, జ్ఞాపికతో ఆయనను ప్రత్యేకంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో టేబుల్ టెన్నిస్ క్రీడను అద్భుతంగా ముందుకు తీసుకెళ్లడంలో సాంబమూర్తి పాత్ర ఎనలేనిదని, నిరంతర సాధనతో క్రీడాకారులను ఛాంపియన్లుగా మలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం జిల్లా క్రీడాధికారి టి. సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి క్రిస్టఫర్ బాబు , జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి. రామారావు, ఎల్.సి.టి బోర్డు మెంబర్ మరియు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరెడ్డి తదితరులు సాంబమూర్తి సేవలను కొనియాడారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీస్తూ ఖమ్మం జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువస్తున్న కోచ్‌లందరినీ వారు సామూహికంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కోచ్‌లకు జరుగుతున్న ఈ ఘన సత్కారాన్ని, క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా విభాగాల సీనియర్ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ అధ్యక్షుడిగా వాసుమల్ల గౌతమ్



**పాల్వంచ, ఆగస్టు 28 (భద్రాద్రి న్యూస్) :** మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ అధ్యక్షుడిగా వాసుమల్ల గౌతమ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ గౌతమ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.
తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్‌తో కలిసి వాసుమల్ల గౌతమ్ సుమారు 1,350 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్ర సందర్భంగా గౌతమ్ యొక్క ఉదార స్వభావం, కష్టపడి పనిచేసే తత్వాన్ని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ గమనించారు. మాల మహానాడు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో గౌతమ్ సమర్థవంతంగా పనిచేస్తారని గుర్తించి జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా యూత్ అధ్యక్షుడు వాసుమల్ల గౌతమ్ మాట్లాడుతూ మాలల ఐక్యత, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు, జిల్లా అధ్యక్షులు తోట మల్ల రమణమూర్తి, సెనగ వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. డెల్లి గణపతి, పెంకి శ్రీనివాసరావు, వల్లమల్ల వెంకటరత్నం, గడిదేసి ప్రభాకర్, శనగ రామ్‌చందర్, హరీష్, కూరపాటి దాస్, శెట్టి కమలాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 3న గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ

**- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్**
**- పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కొరకు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైట్ ను సందర్శించాలి**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 30 (భద్రాద్రిన్యూస్):** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు రెండు నెలల కాలానికి (జాయిన్ అయిన తేదీ నుండి) తాత్కాలిక ప్రాతిపదికన అందించేందుకు సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ ఒకరిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు. వాక్-ఇన్- ఇంటర్వ్యూ సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మం లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ ఖీ-2లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధృవపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత తేదీ, సమయానికి నేరుగా వాక్-ఇన్- ఇంటర్వ్యూ కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు **https://khammam.telangana.gov.in** ను సందర్శించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

# క్రీడా స్ఫూర్తితో కదిలిన త్రివేణి




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (భద్రాద్రిన్యూస్ ):** ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఖమ్మం, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో క్రీడా స్ఫూర్తితో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు స్కూల్ సెల్యూట్‌తో గౌరవం చాటారు. అనంతరం భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శాంతికి ప్రతీకగా పావురాలు, బెలూన్లను విడుదల చేశారు. డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ తమ ప్రతిభను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. “ఆడుదాం.. ఎదుగుదాం.. గెలుద్దాం” అనే స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో నేషనల్ స్పోర్ట్స్ డే

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 30 (భద్రాద్రిన్యూస్ ):** స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో హాకీ మాంత్రికుడు భారతీయ హాకీ దిగ్గజం మేజర్ ద్యాన్‌చంద్ గారి జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. స్కూల్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌ను డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు గారు జెండా ఊపి విద్యార్థుల కేరింతలు, ఉత్సాహాల నడుమ వివిధ క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ మెదడుకు ధ్యానం ఎంత అవసరమో శరీరానికి క్రీడలు అంత అవసరం అంటూ ద్యాన్‌చంద్ గారు 1905 ఆగష్టు 29న జన్మించి హాకీ క్రీడతో ప్రపంచానికి ఆదర్శంగా ఉన్నారంటూ 1928, 1932, 1936 సంవత్సరాలలో జరిగిన ఒలంపిక్స్ క్రీడలలో భారతదేశానికి విజయాలను మరియు బంగారు పతకాలను అందించి భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసి ఎంతోమందికి స్ఫూర్తి నింపినాడు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని అలవాటు చేసుకొని ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ద్యాన్‌చంద్ వంటి గొప్ప క్రీడా కారుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేయాలని తెలియజేస్తూ రెజొనెన్స్ శ్రీనగర్‌లో విద్యార్థులకు చక్కటి క్రీడా మైదానాన్ని, క్రీడా సామాగ్రిని నిష్ణాతులైన వ్యాయామ విద్యా ఉపాధ్యాయులను అందించి బావిభారత క్రీడా కారులను తీర్చిదిద్దుతూ విద్యార్థుల యొక్క మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలను నిర్వహిస్తున్నామంటూ క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సహనం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి లక్షణాలు పెంపొందిస్తాయంటూ అందరికి జాతీయ క్రీడా దినోత్స శుభాకాంక్షలు తెలియజేసారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడలలో తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులను అందించి వారిని ప్రోత్సహించడం జరిగింది. ఈ కార్యక్రమములో విద్యార్థి క్రీడాకారులు మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్ మాలో ఎంతో ఉత్సాహన్ని, క్రమశిక్షణను కలిగింపజేసి ఎంతో క్రీడా స్ఫూర్తిని



కలిగించేలా చేసిన మేనేజ్‌మెంట్ మరియు ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొండా కృష్ణవేణి గారు మరియు ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

# పోలంపల్లి తండా నుంచి జిల్లా కాంగ్రెస్ కమిటీలోకి భద్రు నాయక్

**- సీనియర్ కాంగ్రెస్ నాయకుడికి డీసీసీ కార్యదర్శిగా కీలక బాధ్యతలు**
**- దీర్ఘకాల పార్టీ సేవలు, ప్రజా సేవకు గుర్తింపుగా పదవి**



**కారేపల్లి, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్ -- రాములు):** సింగరేణి మండలం పోలంపల్లి తండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ధారావత్ భద్రు నాయక్‌కు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీలో కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ పట్ల ఆయనకున్న సుదీర్ఘ అనుబంధం, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం, ప్రజా సేవలను గుర్తిస్తూ జిల్లా స్థాయిలో ఈ బాధ్యతలు కల్పించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.
**విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌తో అనుబంధం :** ధారావత్ భద్రు నాయక్ 1990--1994 కాలంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేస్తూ విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం 1999--2003 వరకు పోలంపల్లి యూపీఎస్ గేట్ పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా, 2003--2008 వరకు పోలంపల్లి ఉపాధ్యక్షుడిగా, 2013--2018 వరకు పోలంపల్లి అధ్యక్షుడిగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.
**పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర :** కాంగ్రెస్ పార్టీ చేపట్టిన వరంగల్ డిక్లరేషన్‌పై నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంతో పాటు హాత్ సే హాత్ జోడో యాత్రలోనూ భద్రు నాయక్ చురుకుగా పాల్గొన్నారు. పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేశారు. కరోనా విపత్కర సమయంలో పేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు అందిస్తూ తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. రాయ్‌పూర్‌లో నిర్వహించిన ప్రాథమిక శిక్షణ తరగతులతో పాటు హైదరాబాద్‌లో జరిగిన పీసీసీ శిక్షణ తరగతులకు హాజరయ్యారు.
**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా :** సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించిన అనుభవం తనకు జిల్లా స్థాయి బాధ్యతల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని భద్రు నాయక్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భద్రు నాయక్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకులు, సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ‘హార్వెస్ట్’లో జాతీయ క్రీడా దినోత్సవం






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (భద్రాద్రిన్యూస్ ):** భారత హాకీ దిగ్గజం, ‘హాకీ మాంత్రికుడు’ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని నేడు ‘హార్వెస్ట్’ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం తెలియజేశారు. ముందుగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన భారత హాకీకి అందించిన సేవలను, దేశానికి సాధించిన విజయాలను విద్యార్థులకు కరస్పాండెంట్ పి.రవిమారుత్ గారు, ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి గారు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కరెస్పాండంట్ మాట్లాడుతూ, “విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతో అవసరం. గెలుపు మాత్రమే లక్ష్యం కాకుండా క్రీడాస్ఫూర్తితో పోటీపడటం, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి. అందుకే విద్యార్థుల విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోంది” అని తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి గారు మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల సంపూర్ణ వికాసంలో కీలక పాత్ర పోషిస్తాయి. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి తమ కళాశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి పేరు తీసుకురావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్ సోమశేఖర శర్మ గారు, ఇంచార్జ్ అనీల్ గారు అలాగే అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి: ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**- సింగరేణి మండలంలో**

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: ఇమ్మడి తిరుపతిరావు**



**కారేపల్లి , ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్ -- రాములు):** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం ప్రతి ఒక్క కార్యకర్త అంకితభావంతో కష్టపడి పనిచేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మార్గదర్శకత్వంలో సింగరేణి మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఇమ్మడి తిరుపతిరావు తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు రామ్మూర్తి, గూగులోతు రవి నాయక్, దుగ్గినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జెడ్పీటీసీ అభ్యర్థిగా గురిజాల గోపి..?

**- రేణుకా చౌదరి ప్రధాన అనుచరునిగా గుర్తింపు**
**- ప్రజా సేవకునిగా ముందు వరుసలో గురిజాల**
**- బలరాం నాయక్,రేణుక ల ఆశీస్సులతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి**





**మణుగూరు, ఆగస్టు 30 (భద్రాద్రిన్యూస్ ):** మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ప్రధాన అనుచరులుగా పేరున్న గురిజాల గోపి ఈ సారి మణుగూరు జెడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.త్వరలో జెడ్పీటీసీ, ఎంపిటిసి ల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీకోసం శ్రమించిన వారి వైపే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులుగా అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితులుగా ఉన్న గురిజాల గోపి వైపే మొగ్గు ఉన్నట్లుగా సమాచారం. అంతే కాకుండా సుమారు ఐదు సంవత్సరాలుగా మండలంలోని అనేకమంది నీరు పేదలకు నిత్యావసర వస్తువులు,దుస్తులు,నగదు రూపాలలో అనేక సేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు సంపాదించుకున్న గోపి బి సి నాయకునిగా అన్ని వర్గాలకు సన్నిహితులుగా ఉండడమే ఆయనకు కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు.అలాగే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలలో పట్టున్న నేతగా అనేక మార్లు రుజువు కూడా చేసుకున్నారు.ఎన్నోమార్లు కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు గంటల వ్యవధిలోనే వేలమంది జన సమీకరణ చేసే సత్తా ఉన్న నాయకునిగా...కాంగ్రెస్ పార్టీ విధేయునిగా గోపి పేరు సంపాదించుకున్నారనే గుర్తింపు ఉంది.ఇవన్నీ గురిజాల గోపిని కాంగ్రెస్ పార్టీ తరపున జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో దింపే అవకాశాలు.అంతే కాకుండా మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ప్రధాన అనుచరులుగా ఆయనకు అండదండలతో పాటు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అండతో పాటు వారి ఆశీస్సులతో జెడ్పీటీసీ అభ్యర్థిగా ఈసారి గురిజాల గోపి బరిలో ఉంటారని విశ్వసనీయ సమాచారం.

**త్వరలో మణుగూరు రానున్న రేణుకా, బలరాం నాయక్**

ఇదిలా ఉండగా మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి,మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ లు త్వరలో మణుగూరు మండలంలో పర్యటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికేశీదుకు సన్నాహకాలు చేస్తున్నట్లు సమాచారం.

## కాంగ్రెస్ పార్టీ నూతన కార్యదర్శిగా మిట్టపల్లి సతీష్ నియామకం

**- మిట్టపల్లి సతీష్ ను కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ**



**వైరా, ఆగస్టు 29, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ మండల పరిధి గొల్లపూడి గ్రామానికి చెందిన మిట్టపల్లి సతీష్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి.సి.సి ) అధ్యక్షులు నూతి సత్యనారాయణ శనివారం నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి, క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నుంచి నాయకుడిగా ఎదిగి ప్రజాసేవ పరమావధిగా ఎదుగుతూ జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం సతీష్ కు అభినందనీయమని, నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజల మీద ప్రేమ ఉన్న వాళ్ళకి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ కూడా గుర్తిస్తుందని అన్నారు. వైరా మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన మిట్టపల్లి సతీష్ మంచి ప్రజాసేవ కలిగిన నాయకుడని గొల్లపూడి గ్రామ సర్పంచి మేదూరి రామారావు ప్రోత్సాహంతో, మార్గదర్శకత్వంతో ప్రజా సమస్యల పరిష్కార మార్గంలో ముందుండే మంచి నాయకుడని కొనియాడి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొల్లపూడి గ్రామ ప్రజానీకం, పార్టీ శ్రేణుల్లో ఎంతో ఉత్సాహం కలిగింది. ఈ సందర్భంగా మిట్టపల్లి సతీష్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో, నాలోని సేవా గుణాన్ని గుర్తించి, ప్రజల మీద నేను ఉంచిన నమ్మకాన్ని గుర్తించి, కాంగ్రెస్ పార్టీ నాకు గొప్ప చెప్పిన జిల్లా కాంగ్రెస్ బాధ్యతలను తప్పకుండా పాటిస్తానని, ప్రజా సమస్యలను, ప్రజల కోసం పనిచేస్తానని, నాకు సహకరించి, నన్ను అభినందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులు అరెస్ట్

*- భద్రాచలం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు*



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండల పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం విద్యానగర్ బైపాస్ రోడ్డులోని సుమన్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలం వద్ద ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. విచారణలో తాము గంజాయి సేవిస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. రామవరం ప్రాంతానికి చెందిన వీరిపై కేసు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇద్దరిని భద్రాచలంలోని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## కోయగుంపు రెండో వార్డులో మోరి నిర్మాణం

**- సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు**



**కారేపల్లి, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కోయగుంపు రెండో వార్డులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కన మోరి నిర్మాణ పనులు చేపట్టారు.వర్షాకాలంలో ప్రధాన రహదారి పక్కన వర్షపు నీరు నిలిచిపోకుండా, నీరు సక్రమంగా వెళ్లేలా మోరి నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. రహదారి పక్కన నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.మోరి నిర్మాణం పూర్తయితే వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లడంతో పాటు రహదారి పక్కన పారిశుద్ధ్య సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు తెలిపారు.గ్రామంలో పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, రహదారులు తదితర సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొని మోరి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజును గ్రామస్తులు అభినందించారు.

## జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి

- కార్పొరేట్ శక్తులతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్) :** జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలని జైభీమ్ రావు భారత్ పార్టీ (జేబీపీ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ... పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్య యొక్క ప్రత్యేకత దెబ్బతింటుందని గతంలో పాలిటెక్నిక్ డిప్లమా కోర్సు చేసిన వారు ఈ-సెట్ ద్వారా నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉండేదని రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయం మూలంగా విద్యార్థులు ఉన్నత విద్యలో అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కార్పొరేట్ శక్తులతో కుమ్మకై పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేస్తున్నాడని విమర్శించారు.ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది పాలిటెక్నిక్ విద్యార్థులు టీసీలు తీసుకుంటున్నారని, విద్యార్థుల జీవితాలతో ముడిపడిన అంశం మీద ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేయాలని,విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడే ఏప్రభుత్వాలు అయినా,ఏపార్టీలైనా కనుమరుగు కాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 రద్దు చేయాలని లేని పక్షంలో కలిసి వచ్చే విద్యార్థి సంఘాలను,రాజకీయ పార్టీలను కలుపుకుని ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,వినయ్,బన్నీ,రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత కృష్ణ ప్రసాద్‌ను పరామర్శించిన పార్టీ శ్రేణులు



**కామేపల్లి,ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు మూడ్ కృష్ణ ప్రసాద్‌ను కామేపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య, సామా మోహన్ రెడ్డి,మండల యూత్ ప్రెసిడెంట్ బానోత్ మంగు, ముచ్చర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ జామ్ లుసి గడ్డం వెంకటేశ్వర్లు, మూడు శ్రీను, కన్నమాల రాంబాబు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆదూరి ప్రసాద్, రామకృష్ణ, రాందాస్,మధు, సూర్య,భాను ప్రసాద్,బొంగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్ల దరఖాస్తు గడువు పెంచాలి

**- ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 20 వరకు పొడిగించాలి**

**- సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ డిమాండ్**

**కారేపల్లి, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్ -- రాములు):** రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులు ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం విధించిన గడువును పొడిగించాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ అశోక్ అన్న వర్గం ఖమ్మం జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఆగస్టు 30న ముగియనున్న దరఖాస్తు గడువును సెప్టెంబర్ 20 వరకు పొడిగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని కోరారు. కారేపల్లి మండల కేంద్రంలోని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం నుంచి శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో భూక్య శివ నాయక్ మాట్లాడుతూ.. ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆగస్టు నెలలో వరుస సెలవులు రావడం, సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం, దరఖాస్తుదారులకు వివిధ కారణాలతో అధికారులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా మీ సేవా కేంద్రాల వద్ద సాఫ్ట్‌వేర్, సిగ్నల్ సమస్యలు, సర్వర్ మొరాయించడం వంటి సాంకేతిక ఇబ్బందులతో అనేక మంది అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అర్హులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



**అర్హులందరికీ అవకాశం కల్పించాలి:** జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఆసరా పెన్షన్ల దరఖాస్తు గడువును తక్షణమే పొడిగించాలని శివ నాయక్ కోరారు. ఆగస్టు 30ను చివరి తేదీగా కాకుండా సెప్టెంబర్ 20 వరకు గడువు పెంచి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఒక్క లబ్ధిదారుడు కూడా అవకాశం కోల్పోకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ అశోక్ అన్న వర్గం ఖమ్మం జిల్లా కమిటీ తరఫున ఆయన కోరారు.

## నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి

**- గ్రామీణ పట్టణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలి**
**- ఎన్నికల హామీ ప్రకారం యువతకు నిరుద్యోగ భృతి అందించాలి**
**- ప్రగతిశీల యువజన సంఘం డిమాండ్**
**- జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూనెం మంగయ్య కోర్సా రామకృష్ణ**

**గుండాల ఆగస్ట్ 29 భద్రాద్రి న్యూస్ :** నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆపాలి అని గ్రామీణ పట్టణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం యువతకు నిరుద్యోగ భృతి అందించాలని ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూనెంమంగయ్య కోర్సా రామకృష్ణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం గుండాల మండలంలో కాచనపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన ఇల్లందు డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని అన్ని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి అని. ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నియామకాలు చేపట్టాలి అని ఉపాధ్యాయ,వైద్య,పోలీస్,రెవెన్యూ,విశ్వవిద్యాలయ ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేసి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి కొత్త ఉద్యోగాలు సృష్టించాలి అని కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించి నియామక ప్రక్రియల్లో పారదర్శకత పాటించి పరీక్షలను సకాలంలో నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం తరఫున డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు జీవన భృతి అందించాలని, పరిశ్రమల స్థాపన ద్వారా గ్రామీణ,పట్టణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని అన్నారు. యువతకు ఉపాధి ఉద్యోగం హక్కుగా కల్పించి. ఉద్యోగం కోసం ఎదురుచూడటం మాత్రమే పరిష్కారం కాదు. హక్కుల కోసం సంఘటిత పోరాటమే మార్గం కావాలని అన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ కోసం, ఉపాధి హక్కు కోసం, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా యువత ఐక్యంగా ఉద్యమించాలి అని




యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం ఇల్లందు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వుకే శ్రవణ్. వెలుగు శాంతారావు. ఉపాధ్యక్షులు. ధారావత్ సుందర్. సహాయ కార్యదర్శి కల్తి సుదర్శన్. కోశాధికారి బానోత్ సురేందర్. జిల్లా నాయకులు చంద్రశేఖర్. భయ్యా ఎంకన్న. చందవత్ లక్ష్మణ్. గంగావత్ జగదీష్. దారావత్ రమేష్. తదితరులు పాల్గొన్నారు

## వైరాలో ఘనంగ మల్లు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు

**- తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కుమారుడు మల్లు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు**

**వైరా, ఆగస్టు 29,(భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం మల్లు విక్రమాదిత్య జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి మల్లు సూర్య విక్రమాదిత్య కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, నిండు నూరేళ్లు జీవిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ఆకాంక్షించారు. అనంతరం వైరా ప్రభుత్వ ఏరియా వంద పడకల హాస్పటల్ ను సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను ప్రజాసేవతో ముడిపెట్టి అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి అండగా నిలవడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నట్లు అని, నాయకులు మాట్లాడుతూ మల్లు సూర్య



విక్రమాదిత్య జన్మదిన పురస్కరించుకొని సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోష్ కరమని, ప్రజల సంక్షేమం, సేవా దృక్పథం, కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ ముఖ్యమని పేర్కొన్నారు. మల్లు సూర్య విక్రమాదిత్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ, ప్రజాసేవలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ,



జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దొడ్డ పుల్లయ్య, జిల్లా నాయకులు పొదిల హరినాథ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, వైరా మండల కాంగ్రెస్ నాయకులు పల్లపు కొండలరావు, తేలూరి వీరయ్య, షేక్ బాబు జానీ, బొడ్డు కృష్ణ, పువ్వాళ రాము, బుడిగి వెంకన్న, వేముల కుమార్, వాంకుడోత్ బిఖ్యా, వేల్పుల వెంకటేశ్వర్లు, దూరిసెట్టి నరసింహారావు, షేక్ అజీజ్, వేల్పుల రత్న భరత్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తోటకూర గోపి, సామల కార్తీక్ రెడ్డి, పల్లపు గోపి, తోటకూర నాగరాజు, దుర్గ, దేవుళ్ళ దినేష్, డాక్టర్స్ డి సి హెచ్ ఎస్ కేశవన్ రాజశేఖర్, మారుతీ డాక్టర్స్, నర్సులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫీజు బకాయి బిజెపి లడాయి

**- ఒకే విడతలో ఫీజు రియంబర్స్మెంట్ ను చెల్లించాలి**

**- బిజెపి భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్**

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 29 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం బస్టాండ్ అమర వీరుల స్తూపం వద్ద యువ మోర్చా బిజెపి అధ్యక్షులు, జజ్జూరు మోహన కృష్ణ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పిలుపుమేరకు విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి అని కోరుతూ, నిరసన దీక్షను చేపట్టారు.. ఈ కార్యక్రమానికి హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ వాగ్దానాలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం అమరవీరుల స్తూపశీ బస్టాండ్ సెంటర్ వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో, నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన గుప్పిట్లో పెట్టుకుని విద్యార్థుల భావిభారత భవిషత్ ను నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సుమారు 40 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లించాల్సిన దాదాపు రూ.15,000 కోట్ల ఫీజు బకాయిలు నిలిచిపోవడంతో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, సరి అయిన సమయంలో సర్టిఫికెట్లు పొందలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.15,000 కోట్ల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉగ్రరూపంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు, డాక్టర్ జాటోత్ వెంకన్న, బిక్షపతి, బోగి కృష్ణ, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, కిసాన్ మోర్చా అధ్యక్షులు గొట్టిపుల్ల



దుర్గా శ్రీనివాసరావు, మహబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు భూక్య శ్రీను, మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, గిరిజన మోర్చా అధ్యక్షురాలు భూక్యా స్వాతి, ఓబీసీ మధ్య అధ్యక్షులు జటంగి కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చాపలమడుగు రాకేష్ కుమార్ బాబు, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ బిమల్ కుమార్ జైన్, జిల్లా కార్యదర్శిలు రఘురాం, దురుశెట్టి కుమార్, మీడియా కన్వీనర్ కోలికపోగు రామారావు, మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, పల్లపు వెంకటేశ్వర్లు, ముత్యాల శ్రీనివాసరావు, బిక్షపతి, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కోలా హరీష్, నాయిని శ్రీనివాస్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి సలీం, గుమలాపురపు సత్యనారాయణ, మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 31న సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**- సంచార జాతుల హక్కుల సంఘం ఖమ్మం జిల్లా**

**వైరా, ఆగస్టు 29, భద్రాద్రి న్యూస్ :**
ఖమ్మం జిల్లా లో సంచార జాతుల హక్కుల సంఘం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రెస్ క్లబ్బులో శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో సంచార జాతుల జిల్లా కార్యవర్గం మాట్లాడుతూ ఆగస్టు 31 సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి సంచార జాతుల హక్కులు, సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి ఖమ్మం: ఆగస్టు 31 సంచార జాతుల దినోత్సవం సందర్భంగా సంచార జాతుల హక్కులు, సమస్యలు మరియు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సంచార జాతుల హక్కుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు వల్లెపు సోమరాజు గారు డిమాండ్ చేశారు. సంచార జాతులు తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ కార్యక్రమాల్లో సంచార జాతులకు తగిన ప్రాధాన్యత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లు
సంచార జాతుల కుటుంబాల సమగ్ర సర్వే నిర్వహించాలి.
అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి.
పిల్లలకు విద్య, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతి కల్పించాలి.
యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి.




అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి.
సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
సంచార జాతుల సంస్కృతి, సంప్రదాయాలు మరియు జీవన విధానాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బత్తుల గోపాల్ గారు, జిల్లా ఉపాధ్యక్షులు గోగుల ఆది దేవండ్ల వెంకన్న గారు, నాయకులు శ్రీరాములు గారు మాట్లాడుతూ సంచార జాతుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
"సంచార జాతుల హక్కులు కాపాడాలి -- సంక్షేమం అందరికీ చేరాలి -- అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలి" అని వారు డిమాండ్ చేశారు.
ఆగస్టు 31 సంచార జాతుల దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా, సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యాచరణకు నాంది పలికే రోజుగా నిర్వహించాలని వారు కోరారు.
--- సంచార జాతుల హక్కుల సంఘం
ఖమ్మం జిల్లా